# రుజువు

"ఎలా వున్నాయి ?" అడిగింది రమోలా.

"తియ్యగా వున్నాయి" చెప్పాను.

"నిజంగా ?"

"అవును."

మళ్ళీ పెదవులు అందించింది ఎర్రగా తడితో మెరిసే పెదవులు అందుకున్నాను. కొన్ని నిముషాల తర్వాత అడిగింది.

"తేనెలాగానా ? చెరుకు రసం లాగానా ? మామిడి పండు రుచా ? ఏ రుచి ?"

"అన్నీ కలిపి"

మళ్ళీ దగ్గరకి లాక్కున్నాను. రమోలా నాకౌగిలిలో వదిగిపోయింది. లాలనగా కుడి అరచేత్తో నగ్నంగా వున్న నా వీపును రాస్తుండిపోయింది.

నా రక్తంలో కోరికే కాదు విస్కీ కూడా వుంది. ఆల్కహాల్ ఇచ్చే మత్తులో ఆడపిల్ల దొరికితే ఆ రాత్రి నిద్రరాదు.

తెల్లవారు ఝామున నాలుగు దాకా నిద్ర పోలేదు నేను రమోలా కూడా. ఏ మాత్రం విసుగు ప్రదర్శించలేదు. ఎంతో ఓపికగా అన్నివిధాల నాకు సహకరించింది.

రమోలా దగ్గరకి ఒక్కసారి వస్తే ఇంకో ఆడదాని దగ్గరకు వెళ్ళ బుద్ధి కాదు. మొదటిరోజే అయినా, పదేళ్ళుగా కాపరం చేస్తున్న భార్యలా విడియపడకుండా, విడియ పడనివ్వకుండా ప్రవర్తిస్తుంది.

అందుకే రమోలా దగ్గరకి తరచు వస్తున్నాను. రాత్రికి అయిదు వందలు తీసుకుంటుంది. అది ఎక్కువే, కాని విస్కీ ఉచితంగా ఇస్తుంది. పాలరాతి శిల్పంలా అందంగా వుండకపోయినా ఏదో ఆకర్షణ వుందామె ఒంట్లో.

మర్నాడు ఉదయం ఐదింటికి నిద్ర లేచాను అలారం మోగితే. రమోలా ఇంకా నిద్రపోతోంది.

అరగంటలో మొహం కడుక్కొని స్నానం చేసాను.

రమోలాకి మెలకువ వచ్చింది కాని బద్ధకంగా పడుకునే వుంది. లేవలేదు.

"గుడ్ మార్నింగ్" అన్నది చిన్నగా నవ్వి.

ప్రతిగా విష్‌చేసి నవ్వాను.

"వెళ్తున్నాను" చెప్పాను.

లేవబోయింది.

"ఫర్వాలేదు, పడుకో శనివారం రాత్రి వస్తాను" చెప్పాను.

తలాడించింది.

బయటికి నడిచాను.

మోటర్ సైకిల్ ఎక్కి స్టార్ట్ చేస్తూండగా ఒకతను వచ్చి మోటర్ సైకిల్‌కున్న తాళంచెవి తీశాడు చటుక్కున.

అతనివంక కోపంగా చూసాను.

యూనిఫారంలో వున్న సబ్ఇన్‌స్పెక్టర్ :

"ఏమిటిది ?" అడిగాను కొద్దిగా తొట్రుపాటు బడుతూ.

"మీరు రావ్‌బహదూర్‌గారి అబ్బాయి కదా ?"

"అవును"

"తెలుసు నాకు. రెండో అబ్బాయి."

"అయితే ?"

"యు ఆర్ అండర్ అరెస్ట్ ప్లీజ్."

తెల్లబోతూ చూసాను.

తలవూపి దూరంగా జీప్ దగ్గర నిలబడి వున్న ఇద్దరు కాన్‌స్టేబుల్స్‌కి సౌంజ్ఞ చేసాడు. వాళ్లు దగ్గరికి వచ్చారు.

"నే చేసిన నేరం ?" అడిగాను.

"మీకు తెలియదా ?"

"నేనే నేరం చేయలేదు కాబట్టి తెలియదు."

రమోలా వేశ్య అని తెలిసి నన్ను పట్టుకుంటున్నారా ? రెయిడ్ చేయలేదే ఇల్లు రాత్రి ? ?

"చెప్పండి నేరం ?" అడిగాను

"హత్య"

ఉలిక్కిపడ్డాను.

వెంటనే మోటర్ సైకిల్ దిగి స్టాండ్ వేసాను.

"హత్య ?"

నా స్వరంలో నాకే ఆశ్చర్యం వినిపించింది.

"మీ నాన్నగారిని."

"నాన్నగారు హత్య చేయబడ్డారా ?"

నా గుండె ఝల్లుమంది. కాదు గుండెలో అగ్ని పర్వతం ప్రేలినట్లయింది.

"రండి"

"ఎక్కడికి ?" అడిగాను.

"పదండి లోనికి"

మళ్ళీ నేను, ఇన్స్‌పెక్టర్‌తో కలసి లోనికి రావడం రమోలా భయంగా చూసింది మావైపు. 'భయం' అవసరం లేదన్నట్టు తల ఆడించాను'

"ఎలా జరిగింది ?" అడిగాను పెగుల్చుకుని.

"కత్తితో పొడిచి చంపావు."

నీకు తెలియదా అన్నట్లుగా చెప్పాడు నవ్వి.

"కత్తి మీద నా వేలి ముద్రలున్నాయా ?" అడిగాను.

తల వూపాడు.

'రాత్రి పన్నెండున్నర, మూడు మధ్య ఎక్కడున్నారు ?' అడిగాడు హేట్ టేబిల్ మీద వుంచి.

'అప్పుడు జరిగిందా హత్య'

'అవును'

జవాబు చెప్పలేదు వెంటనే.

'ఎలిబి వుందా మీకు ?'

తల వూపాను.

'ఇక్కడ రమోలా ఇంట్లో వున్నారా ?'

తల వూపాను మళ్ళీ.

'రాత్రంతా మీరు తనతో వున్నట్లు రమోలా కోర్టుకి వచ్చి సాక్ష్యం ఇస్తుందా ?'

'ఏమంటావ్ ?' అన్నట్లుగా నేను రమోలా వైపు చూశాను.

'ఆయన రాత్రంతా ఇక్కడే వున్నారు.'

'ఇక్కడ కాదు. కోర్టులో చెప్పాలి.' ఇన్స్పెక్టర్ అన్నాడు.

కొన్ని క్షణాలు ఆలోచిస్తూ నావంక చూసాడు. తర్వాత చెప్పాడు.

'మీరు వప్పుకోవడం మంచిది. రమోలా ఎలాంటి మనిషో తెలుసు కదా ? ఆ అమ్మాయి సాక్ష్యం ఎవరూ నమ్మరు.

'నేను సాయంత్రం ఆరున్నరకి వెళ్ళాను. మళ్ళీ మీరు నన్ను అరెస్ట్ చేసేదాకా మేడదిగి రాలేదు. రుజువు చేసుకొనగలను. మేడ దిగి కిందకు వచ్చినా ఆ ఇంటి తలుపు కింద తాళం పెట్టే వుంటుంది. లోపల

ఇంటి వాళ్ళని లేపి తాళం తీయమంటే కాని తీయరు. డూప్లికేట్ రమోలా దగ్గరలేదు. ఇంటి వాళ్ళు ఆ సంగతి చెప్తారు.'

'ఇంకో గుమ్మంలోంచి....?'

'ఆ ఇంట్లోంచి బయటకి రావాలంటే అదే దారి. రెండో గుమ్మం వెనక గదిలో వుంది. అది ఇంటి వాళ్ళ బెడ్ రూం.

కొద్దిసేపు ఆలోచించి చెప్పాడు.

'మీరు చెప్పింది స్టేట్ మెంట్ రాసివ్వండి. ప్రతీ అంశం తణికీ చేస్తాను.

'కాగితం ఇవ్వండి' రమోలా నడిగాను.

రెండు తెల్ల కాగితాలు అందించింది వాటి మీద రాసాను చెప్పింది.

'రమోలా కాకుండా ఆ ఇంట్లో ఇంకెవరయినా వున్నారా ?'

'అంటే ?"

'మీ స్నేహితుడో, ఆమె స్నేహితురాలో.... ?'

'లేరు.'

'అంటే రమోలా ఒక్కతే మీకు ఎలిబీ ?'

'అవును'

'ఆ సంగతి కూడా స్పష్టంగా రాయండి.'

తర్వాత మరొకరున్నారని నేను దబాయించే అవకాశం వుండకుండా జాగ్రత్తపడ్డాడు ఆ సంగతి కూడా రాసాను దాంట్లో.

'మీరు ఆ సమయంలో ఆల్కహాల్ తీసుకున్నారా ?'

'అవును ఏం ?'

'అది కూడా రాయండి. ఎంత తీసుకున్నారో కూడా రాయండి. కత్తి పోటు తాగినవాళ్ళు పొడిచారో, తాగనివాళ్ళు పొడిచారో కూడా లేబరేటరీలో గాయాన్ని బట్టి నిర్ణయిస్తారు.

రాసి సంతకం పెట్టి అందించాను అతనికి.

పూర్తిగా చదివి చెప్పారు.

'సాక్షిసంతకం పెట్టాలి. మీ స్నేహితు లెవరయినా వచ్చి పెడ తారా?'

'అవసరమా ?'

'ఇదంతా ఎలాగూ అందరికీ తెలియక మానదు. అయినా మీకు నమ్మకస్తులయిన వాళ్ళని పిలవండి'

నా స్నేహితులిద్దరికి ఫోన్ చేసాను. అరగంటలో వచ్చారు జరిగింది వివరించాను.

వాళ్ళు సాక్షి సంతకాలు చేసారు.

'మీ అన్నయ్య మీకు బెయిల్ ఏర్పాట్లు చేసాడు. ఇక వెళ్ళచ్చు. కాని పోలీసుల అనుమతి లేకుండా ఈ వూరు వదిలి ఎక్కడికీ వెళ్ళ కూడదు.' హెచ్చరించాడు.

లేచి నిలబడి అడిగాను.

'మా నాన్నగారి శవం ఎక్కడుంది ?'

'పోస్టుమార్టం జరుగుతోంది. ముందర ఇంటికి వెళ్ళండి. మీ ఆవిడ ఎదురు చూస్తోంది మీకోసం.'

గంట తర్వాత ఇంటికి చేరుకున్నాను వంటరిగా.

నా గుండె ఝల్లుమంది.

నాన్నగారు బ్రతికే వున్నారు. ముందర గదిలో పడక్కుర్చీలో పడుకుని పైప్ తాగుతున్నారు.

ఆయన నా రాకను గుర్తించి కూడా గుర్తించనట్లుగా వూరుకున్నారు. మా ఇద్దరి మధ్యా చాలా కాలంగా మాటలు లేవు. ఆయన ఉద్దేశంలో నేను తిరుగుబోతు.

'మీరు బ్రతికేవున్నారా ? అమ్మయ్య' అన్నాను సంతోషంగా.

ఆయన నా మొహంలోనికి చురుగ్గా చూసారు.

'నే చావాలని వుందా ?' అడిగాడు

గడగడా జరిగిందీ చెప్పాను రమోలా విషయం మాత్రం దాచి. వెంటనే లేచి నిలబడ్డారు. ఏమనుకున్నారో లోపలికి వెళ్ళిపోయారు. నేను నా గదిలోకి నడిచాను.

నా భార్య చేతిరాత వుంది ఆ కవరు మీద. నా పేరు రాయబడి వుంది అద్దానికి ఆ కవరు సెలిఫోన్ ఎడ్ హెసివ్ టేప్‌తో అతికించబడి వుంది. గదిలోకి రాగానే కనబడుతుంది ఆ కవరు.

గబగబా దాని దగ్గరకి నడిచి అందుకుని చింపి చదివాను, ఉత్తరం బయటకి తీసి.

"మీకు,

మీ స్టేట్‌మెంట్ ఉపయోగించి విడాకులు తీసుకుంటున్నాను. విడాకులు తీసుకోవడం కష్టం అన్నారు ఆ రోజు. గుర్తుందా?

కాదు.

"చాలా తేలిక."

నా భార్య సంతకం వుంది ఉత్తరం కింద.

ఎవరో ఎస్. ఐ. యూనిఫారంలో నాటకం ఆడారని గ్రహించ డానికి ఒక్కక్షణం కూడా వృథాకాలేదు నాకు.

(అన్వేషణ మే 1979)